


# జ్ఞాన గంగ

గంగా మా

## గంగా మా,



భక్తులు ప్రేమగా గౌరవంతో "అమ్మ" అని పిలుచుకునే "గంగామా" భగవాన్ శ్రీ రమణల అనుగ్రహం పొందిన సత్య స్వరూపిణి. అమ్మ అపార కరుణాసాగరం, మూర్తిభవించిన గురుతత్వం. అమ్మ తన అపార అనుగ్రహంచే ఎంతోమంది భక్తుల జీవితాలను మార్చి వేశారు. అమ్మ మాతృ రూపంలో ఉన్న గురుస్వరూపం, శుద్ధ ప్రేమ మరియు ఉత్కృష్టమైన జ్ఞానముల సమ్మేళనం. అమ్మ దివ్య సాన్నిధ్యంలో భక్తులు శాంతి, మౌనాలను సహజంగానే అనుభూతి చెందుతారు.

అమ్మ గురువు గురించి చెబుతూ **"గురువు మీ ప్రశ్నకు సమాధానం ఇవ్వడు, కానీ మిమ్మల్ని మీ అంతరంగంలో ఉన్న సమాధానానికి తీసుకెళ్తాడు"** అంటారు. అమ్మ వద్దకు స్పష్టత కోసం సందేహాలతో, ప్రశ్నలతో వచ్చే భక్తుల స్వానుభవం కూడా ఇదియే. ఈ పుస్తకములోని అమ్మ బోధామృతం మన అజ్ఞాన తిమిరాన్ని పారద్రోలి జ్ఞానజ్యోతిని ప్రజ్వలింపచేస్తుంది.

# జ్ఞాన
# గంగ

గంగా మా

First Edition: March 2025

Published by Hridaya Kshetram Trust
110/73 R.S. Nagar
Tiruvannamalai – 606 603
Tamil Nadu – India

www.hridayakshetram.org
publications@hridayakshetram.org

## పరిచయం

ఆధ్యాత్మిక దృక్కోణం నుండి ఈ ప్రపంచంలోని వ్యక్తులను మూడుగా వర్గీకరించవచ్చు:

1. సత్యం గురించి తెలియనివారు
2. సత్యాన్ని తెలుసుకోవడానికి ప్రయత్నిస్తున్న అన్వేషకులు
3. సత్యాన్ని తెలిసినవారు

ఆసక్తికరంగా, పూర్తి అజ్ఞానంలో ఉన్నవారికి మరియు ఆత్మ జ్ఞానంలో స్థిరపడిన వారికి ఈ ప్రపంచ స్వభావం గురించి ఎటువంటి సందేహాలు ఉండవు. అనిశ్చితితో బాధపడుతున్న అన్వేషకులు మాత్రమే మరింత విచారణకు పూనుకుంటారు.

నిబద్ధత కలిగిన అన్వేషకులు దైవానుగ్రహం ద్వారా గురువు వైపు నడిపింపబడతారు. గురువు సాన్నిధ్యానికి వచ్చినప్పుడు అన్వేషకుడు మిగతావన్నీ క్రమంగా వదిలి, వైరాగ్యం పొంది గురువు చరణములకు శరణాగతి చెంది, ఆయన బోధన మరియు నిర్దేశించిన మార్గంలో నడవటానికి నిశ్చయించుకుంటారు. మరో మాటలో చెప్పాలంటే సాధకులు మిగతావన్నీ విడిచి కేవలం ఆత్మపైనే దృష్టి పెడతారు. కఠోపనిషత్తులో ఒక ప్రసిద్ధ వాక్యం ఉంది,'యం ఏవ ఏషః వృణుతే తేన లభ్యః', అంటే ఆత్మను మాత్రమే ఎంచుకునేవారు ఆత్మను పొందుతారు.

తిరువణ్ణామలై అను పవిత్ర ఆలయ పట్టణంలో ఉన్న మన ప్రియమైన గంగా మాతను, ప్రేమగా "అమ్మ" అని పిలుచుకుంటున్నాము. ఆమె సాధారణ దృష్టికి గోచరించరు. జ్ఞాన తృష్ణ కలవారు అమ్మను సులభంగా గుర్తిస్తారు. గత కొన్ని సంవత్సరాలుగా అనేక మంది సాధకులు తమ సందేహాలు నివృత్తి చేసుకోవాలని మరియు తమ ఆధ్యాత్మిక అభ్యాసాలను గురించిన స్పష్టతను పొందాలని అమ్మని దర్శించుకుంటున్నారు. అమ్మ ఉపదేశాలు/ భక్తులకు ఇచ్చిన మార్గదర్శకాలు కొన్నిఈ పుస్తకంలో పొందుపరచబడినవి.

ఈ చిన్న పుస్తకములో పొందుపరచబడిన అమూల్యమైన జ్ఞానం సత్యాన్వేషకులకు నిర్దేశించబడినది. ఇది సూత్రముల రూపంలో ఉన్నది. ఇది సాధారణ పఠనముకు ఉద్దేశించబడినది కాదు. ఇది మనల్ని అంతర్ముఖులను చేసి ధ్యాన నిమగ్నులను చేయుటకు ఉద్దేశించబడినది. ముఖ్యంగా ఈ సూత్రములు అమ్మ స్వాత్మానుభవ ఆనంద స్థితిని వెల్లడి చేస్తాయి. ఈ పుస్తకము ద్వారా జ్ఞాన అన్వేషకులకు గరిష్ట ప్రయోజనం పొందాలని మరియు ఆధ్యాత్మిక వికాసం ద్వారా మానవ జీవిత అత్యున్నత పరమార్థాన్ని సాధించాలని ఆ సర్వేశ్వరుని ప్రార్థిస్తూ...

హరి ఓం.

సుబ్బు వెంకటకృష్ణన్

## విషయ సూచిక


1. గురువు ----- 1
2. భక్తి ----- 3
3. శరణాగతి ----- 4
4. ఆత్మ జ్ఞానం ----- 6
5. మరణం ----- 10
6. ఆత్మ ----- 11
7. ఆధ్యాత్మిక మార్గంలో బలం ----- 13
8. సాధకులకు మార్గ నిర్దేశం ----- 14
9. జ్ఞాని ----- 18
10. అనుగ్రహం ----- 20
11. కరుణ ----- 22
12. జీవుడు ----- 23
13. మనస్సు యొక్క పోకడలు ----- 26
14. జ్ఞానం ----- 28

జ్ఞానగంగ

# గురువు

1. సత్యాన్ని చేరుకోవడానికి రెండు మార్గాలు మాత్రమే ఉన్నాయి: ప్రపంచాన్ని మీ గురువుగా చూడటం లేదా మీ గురువును ప్రపంచంగా చూడటం.

2. గురువు (ఆత్మగా) తన అనుగ్రహం ద్వారా శిష్యుని అయస్కాంతంవలె తన వైపుకు ఆకర్షిస్తారు. గురువు (ఆత్మ) వైపు అప్రయత్నంగా మరియు సహజంగా కదులుటయే శిష్యుని మార్గం. గురువు, అనుగ్రహం మరియు మార్గం ఒక్కటే.

3. గురువు ద్వైతాన్ని సమర్థించరు. ఎవరైనా తమలో ద్వైతాన్ని కలిగి ఉంటే, ఆయన దానిని తొలగిస్తారు.

4. గురువు/ దైవానికి నిజమైన సాన్నిహిత్యం అంటే ఆయనకు నచ్చిన విధంగా మిమ్మల్ని మలచుకునే స్వేచ్ఛను ఆయనకు ఇవ్వటం.

5. గురువు అనుగ్రహంతో, స్వల్ప వ్యవధిలోనే అనేక జీవితకాల బోధనలు (పాఠాలు) ప్రసాదించబడతాయి.

6. అంతరంగంలో పరిపూర్ణ వివేకం ఉంటే బాహ్యా గురువు అవసరం లేదు, ఎందుకంటే వివేకమే అంతర్గత గురువు.

7. గురువుకు మరియు ఆయన బోధనలకు మధ్య భేదం లేదు. గురువు పట్ల  ప్రేమ అంటే ఆయన బోధనల పట్ల ప్రేమయే మరియు ఆయన బోధనల పట్ల ప్రేమ సహజంగానే గురువు పట్ల ప్రేమకు దారితీస్తుంది.

8. గురువు మీ ప్రశ్నకు సమాధానం ఇవ్వరు. కానీ మిమ్మల్ని మీ అంతరంగంలో ఉన్న సమాధానానికి తీసుకెళ్తారు.

9. నువ్వు గురువును నీ శాస్త్ర జ్ఞానంతో సంతోషపెట్టలేవు. ఆయనకు కావాల్సింది "నీవు" మాత్రమే.

## భక్తి

10. సత్యం పట్ల ఆర్తి, గురుభక్తికి దారి తీస్తుంది. సత్యం పట్ల జిజ్ఞాస తీవ్రంగా ఉన్నప్పుడు అనుగ్రహం వలన ఆత్మానుభూతి కలుగుతుంది. అప్పుడు హృదయంలో కృతజ్ఞతాభావం వికసిస్తుంది. అదే గురుభక్తి.

11. అహంకారం లేదా వ్యక్తిత్వం నశించినప్పుడే, నిజమైన భక్తి కలుగుతుంది. అక్కడ దైవం మాత్రమే మిగిలి ఉంటుంది.

12. భక్తి లేకుండ జ్ఞానం అసంపూర్ణంగా ఉంటుంది మరియు జ్ఞానం లేకుండ భక్తి సంపూర్ణతను పొందదు. అవి రెండు కలిసి ఉన్నప్పుడు మాత్రమే పరిపూర్ణత కలుగుతుంది.

## శరణాగతి

13. మనం పూర్ణులం కావాలంటే ముందు శూన్యులం (అహంకార నాశనం) కావాలి.

14. చైతన్యం జడమును (అహంకారం /మనస్సు) తాకినప్పుడు, జడం దాని స్వభావాన్ని కోల్పోతుంది. ఇదే శరణాగతి.

15. మనం గురువుకు లేదా దైవానికి బేషరతుగా శరణాగతి చెందినప్పుడు వారి అనుగ్రహంతో సంపూర్ణ శరణాగతి జరుగుతుంది. జీవుని బాధ్యత బేషరతుగా శరణాగతిలో ఉండుటవరకే. అప్పుడు అనుగ్రహం తన శక్తితో సంపూర్ణ శరణాగతి జరిగేటట్లు చేస్తుంది. అనుగ్రహం ఎల్లపుడు బేషరతుగానే ఉంటుంది. మనము బేషరతుగా శరణాగతిలో ఉన్నపుడు మాత్రమే దానిని సంపూర్ణముగా స్వీకరించగలము.

16. తనకంటూ ప్రత్యేక అస్తిత్వం (వ్యక్తిత్వం) ఉండాలనీ కోరుకోకుండా ఉండటమే శిష్యత్వ లక్షణం.

## ఆత్మ జ్ఞానం

17. 'ఆత్మజ్ఞానం' మాత్రమే అందరికీ సమానంగా అందుబాటులో ఉంటుంది. ఒకరి నుండి ఇవ్వబడటానికి లేదా బోధించబడటానికి అది ఏదో క్రొత్తది కాదు.

18. వృక్షం ఫలవంతమైనప్పుడు దాని శాఖలు వాటింతటఅవే ఎలా క్రిందకు వంగుతాయో, అలాగే ఆత్మ జ్ఞానోదయం అయినప్పుడు, భక్తి, శరణాగతి మరియు వినయం అంతరంగంలో సహజంగానే వికసిస్తాయి.

19. 'నేను ఎవరు' అని తెలుసుకోవటం అంటే దైవాన్ని తెలుసుకోవటం మరియు దైవాన్ని తెలుసుకోవటం అంటే 'నేను ఎవరు'అని తెలుసుకోవటం.

20. నేను దేనితోనైనా తాదాత్మ్యం (మమేకం) చెందితే, అది దైవమైనా కావచ్చు, నేను పరిమితుడను అవుతాను. పట్టుకోవడానికి ఏ తాదాత్మ్యం (మమేకం) లేనప్పుడు, నేను నా శాశ్వత మరియు అపరిమిత తత్వాన్ని తెలుసుకోగలుగుతాను.

21. తెలియబడలేనిదాన్ని తెలుసుకోవాలంటే, మీరు ఇప్పటికే మీకు తెలుసునని అనుకుంటున్నది మీకు తెలియదని మీరు అర్థం చేసుకోవాలి. ఇప్పటికే మీకు తెలిసినదాన్ని వదిలేసి ఏమీ తెలియని స్థితిలో ఉండాలి.

22. కారణం మరియు కార్యం సాపేక్ష స్థాయిలో మాత్రమే ఉంటాయి. కారణాన్ని పట్టుకోవడం అంటే భ్రమను (మాయను) పట్టుకోవడమే. మీ జన్మకే కారణం లేదు. మీరు ఎన్నడూ జన్మించలేదు.

23. కల ఉన్నప్పుడు మాత్రమే మేల్కొనుట అనేది జరుగుతుంది. కలను కనేవాడిని కనుకున్నప్పుడు కల

ముగుస్తుంది. అదేవిధంగా కలను కనేవాడి మూలం కనుకున్నప్పుడు జీవితం అనే కల ముగుస్తుంది. సత్యానికి కల లేదు మరియు మేల్కొనుటా లేదు.

24. బంధం నుండి బయటపడటానికి ఏకైక మార్గం, బంధం యొక్క అవాస్తవికతను గ్రహించటయే. మీరు పట్టుకోవడానికి ఏమీ లేదు మరియు వదిలివేయడానికి ఏమీ లేదు. మీరు మీరుగా (స్వరూపంగా) ఉండండి. ఆత్మ యొక్క స్వభావం బంధరహితం.

25. అత్యున్నత సాధన చేస్తున్నా లేదా చాలా స్థూలమైన వ్యవహారం చేస్తున్నా, ఆత్మ ఒకేలాగ ఉంటుంది. అత్యున్నతమైన ఆధ్యాత్మిక సాధన ద్వారా ఆత్మ ఏమీ లబ్ధి పొందదు లేదా స్థూలమైన వ్యవహారం ద్వారా అది ఏమీ కోల్పోదు. ఇది తెలుసుకుని మీ సాధనను కొనసాగించండి.

26. చూసేవాడిని (ద్రష్టని) చూసినప్పుడు నేను ముక్తుడను. విషయములను(దృశ్యంను) చూసినప్పుడు నేను బద్దుడను.

27. ఏకత్వం అనేది బాహ్యంలో ఉండదు. రెండు విషయాలు ఒకటిగా ఎలా ఉండగలవు? అది శరీరం, మనస్సు లేదా అహంకారం స్థాయిలలో ఎన్నడు జరగదు. ఎరుక స్థాయిలో ఏకత్వం కూడా ఉండదు, కేవలం ఏకం మాత్రమే ఉంది.

28. ఆత్మ జ్ఞానం అనేది చర్చించడానికి కాదు, స్వానుభావానికి మాత్రమే.

29. పరిపూర్ణజ్ఞానం మాత్రమే ఉపశమనం మరియు స్వేచ్ఛను ఇస్తుంది.

## మరణం

30. జీవించాలి అనే కోరికయే మరణ భయానికి కారణం.

31. మరణ భయం కూడా ఒక ఆలోచనయే. అయితే మరణం అనేది సహజ0గా జరుగుతుంది.

32. జన్మకు కారణాన్ని మీరు అంగీకరిస్తే, అప్పుడు దాని కార్యం మరణమే.

33. 'నాది' అని భావించే దేనిపైనన్నా అహంకారం తన పట్టును కోల్పోయినప్పుడల్లా, అది అహంకారం యొక్క చిన్నపాటి మరణమే.

34. ఎరుక లేకుండా అహంకారం మరణిస్తే, అది భౌతిక మరణం. ఎరుకతో అహంకారం మరణిస్తే అది సమాధి.

## **ఆత్మ**

35. ఆత్మకు రాగము లేదు, విరాగము లేదు. అది తానుగానే ఉంది.

36. చిత్ (చైతన్యము) నుండి దూరంగా నా ప్రత్యేక అస్థిత్వం (లేదా వ్యక్తిత్వము) స్వార్థం. ఆత్మానుభవమే నిస్వార్థం.

37. ఆత్మను అనుభూతి చెందజాలము, ఎందుకంటే అన్ని అనుభవాల అనుభవం ఆత్మయే.

38. భగవాన్ (ఆత్మ) గురించి మనం ఆలోచించజాలము, ఎందుకంటే ఆలోచించటానికి ఆయన ఒక విషయం కాదు. మిగతావన్నీ ఆలోచన పరిధిలోకి వస్తాయి. ఆయనే మనలోని అస్థిత్వం. మిగతావన్నీ కూడా ఒక ఆలోచనయో, భావనయో,

అనుభవమో, ఆస్వాదనయో కాగలవు. అవి ఏవీ కూడా ఆయనకు అన్యంగా లేవు.

39. సంతృప్తి అనేది ఆత్మ యొక్క స్వభావం, శరీరంది లేదా మనస్సుది కాదు.

40. ఈ ప్రపంచంలో ప్రతిదీ సవ్యంగా లేదా అనుకూలంగా ఉంటే, ఎవరూ దైవాన్ని లేదా ఆత్మని కోరుకోరు. ప్రపంచం అపసవ్యంగా ఉన్నందున, మనం పరిపూర్ణత కోసం దైవాన్ని లేదా ఆత్మని కోరుకుంటాము.

41. 'నేను' ఉంటేనే ఆధ్యాత్మిక ప్రయాణం అయినా ఉన్నది. అన్ని ఆధ్యాత్మిక ప్రయత్నాలకు మరియు సాధనలకు 'నేను'సాక్షి, మరియు చివరికి 'నేను' శుద్ధమైన నేనును పొందుతుంది.

## ఆధ్యాత్మిక మార్గంలో బలం

42. నిజమైన బలం అహంకారంది కాదు, సత్యానిది.

43. నిర్గుణ 'నేను'ను గురించి ధ్యానం చేసినప్పుడు, మనస్సు నిశ్చలతను పొందుతుంది. కానీ మనస్సు అక్కడే ఉండలేక బాహ్య విషయాలను పట్టుకోవటానికి బలముగా బయటకు వస్తుంది. మనస్సును తిరిగి శుద్ధమైన 'నేను'కు తీసుకురావటమే వైరాగ్యం.

44. జ్ఞానదృష్టితో విషయాలను (ప్రపంచం) చూడటం అంతర్గత బలం.

45. ప్రపంచం అల్లకల్లోలం అయినప్పుడు కూడా, మీ దృష్టిని స్థిర సత్యంపై ఉంచండి. అదే మీకు ఉన్న ఏకైక రక్షణ.

## సాధకులకు మార్గ నిర్దేశం

46. శాస్త్ర వాసనకు కారణం చంచలమైన బుద్ధి. ఇది నశించినప్పుడు మాత్రమే మనం అంతర్ముఖులమై, ఆత్మనిష్టులమై సంతుష్టులం కాగలము.

47. 'శ్రద్ధ' (ఎరుక) అంటే ఏదో ఒక విషయం పైన ఏకాగ్రత లేదా దృష్టి పెట్టడం కాదు. మనస్సు తన అన్ని ధ్యేయాలను (ఏకాగ్రతా స్థానాలను) కోల్పోయినప్పుడు, మీరు సహజంగానే ఎరుకలో ఉంటారు. ఆ ఎరుకలోనే సర్వం ఉన్నది.

48. 'సుమ్మా ఇరు' (నిశ్చలంగా ఉండండి) అనే ఆదేశం ఆత్మకు లేదా శరీరానికి కాదు, అహంకారానికి.

49. సంతృప్తి నిజమైన సన్యాసాన్ని ఇస్తుంది, అంతేకానీ అంతరంగములోని ఏదైనా లోటు కాదు.

50. మనస్సు యొక్క వాసనలకు చలించక నిగ్రహించి ఉండటమే క్రమశిక్షణ. అహంకారాన్ని ఎరుక యొక్క పరిశీలన(నిష్ఠా)లో ఉంచాలి. అన్ని బాహ్య క్రమశిక్షణలు మరియు యోగ నియమాలు దీని క్రిందకు వస్తాయి. ఈ అంతర్గత క్రమశిక్షణ సూటి అయినది మరియు అవసరమైన మార్పును తీసుకురావడానికి ఇదే ఏకైక మార్గం.

51. 'నేను బ్రహ్మాన్ని' అనే తత్వాన్ని తనకు బ్రహ్మం తెలుసునని భావించే వ్యక్తితో (అహంకారం/మనస్సు) కలపవద్దు. తెలుసుకునేవ్యక్తి (జ్ఞాత) లేనప్పుడు, ఉండేది బ్రహ్మం మాత్రమే.

52. సాధు, సత్పురుషుల జీవిత చరిత్రలు చదివేటప్పుడు కొన్నిసార్లు మనకు తెలియకుండానే అనుకరణలో పడవచ్చు. మనస్సు వాళ్లతో పోల్చుకొని, తప్పుడు అభిప్రాయాలను ఏర్పరచుకొని, ముక్తి పొందటానికి ఆ సత్పురుషుడు నడిచిన మార్గమే

ఏకైక మార్గం అని నమ్మి దానిని అనుకరించాలని అనుకుంటుంది. ప్రతి వ్యక్తి ప్రయాణం పూర్తిగా ప్రత్యేకమైనది. సాధువుల జీవితాల గురించి చదవాలి, దాని నుండి ప్రేరణ (స్ఫూర్తి) పొందాలి. దానిని మన సాధనలోకి మరల్చుకోవాలి.

53. ముక్తి అనేది ఒక కోరిక అయినప్పుడు, 'కోరుకునేవాడు' ఏదో ఒకటి పొందటానికి మిగిలే ఉంటాడు. 'ముక్తి' అవసరం అయినప్పుడు బంధం నుండి బయటపడవలసిన ఆవశ్యకత సహజం.

54. నేను సత్యాన్ని ప్రేమిస్తున్నప్పుడు మరియు దాన్ని పొందటం నాకు అవసరం అయినప్పుడు, దాని కోసం నేను చేసే అన్ని సాధనలు పూర్తిగా ప్రయత్నరహితమై ఉంటాయి.

55. సరైన చర్య అంటే ఏమిటి? నేను నాప్రత్యేక వ్యక్తిత్వం కోల్పోయినప్పుడు, చేసేవాడు (కర్త) లేనందున నాద్వారా సరైన చర్య జరుగుతుంది.

56. అన్ని ప్రాపంచిక ఆసక్తులపై నాకు విరక్తి కలిగినప్పుడు మాత్రమే నా పూర్తి దృష్టి ఆత్మ పైన ఉంటుంది.

## జ్ఞాని

57. శుద్ధమైన చైతన్యానికి (శుద్ధ చిత్తుకి) తన అస్థిత్వం గురించి చెప్పుకోటానికి చేతులు, కాళ్ళు లేదా నోరు ఉండవు. అదృష్టవశాత్తూ చిత్స్వరూపుడైన జ్ఞాని, తన స్వానుభవం ద్వారా ఆ స్థితి ఏమిటో మరియు ఎలా ఉంటుందో వివరిస్తాడు.

58. జ్ఞాని ఏకకాలంలో పూర్ణుడై మరియు శూన్యుడై ఉంటాడు. అతడు మనోరహితుడై, మరియు బ్రహ్మనిష్ఠుడై ఉంటాడు.

59. జ్ఞాని ఉదాసీనంగా (ఏమీ పట్టనట్లు) ఉండడు. ఎవరి మనస్సు భేదాన్ని మాత్రమే చూస్తుందో వారికి మాత్రమే ఆయన అలా కనిపిస్తాడు. భేదం ఉన్నచోటే ఉదాసీనత కనిపిస్తుంది. ఉదాసీనత కూడా ఒక మానసిక వికారం. అయితే జ్ఞాని స్థితి అన్నింటినీ

తనలో ఇముడ్చుకుని ఉంటుంది, అక్కడ భేదం కానీ లేదా ఉదాసీనత కానీ ఉండవు.

60. మనం మన అభిప్రాయాలు, అనుబంధాలు మరియు కోరికలతో మన జీవితాలను గడుపుతాము. ఇవి జీవిత గమనానికి నిరోధకాలు. జీవితం ఒక వైపుకి సాగుతుంటే మనం దానిని భిన్నంగా ఉండాలని కోరుకుంటున్నాము. అయితే జ్ఞాని జీవిత ప్రవాహంతో పూర్తి సామరస్యంగా కదులుతాడు.

61. అత్యంత పారవశ్య అనుభవం, అది ఆధ్యాత్మికమైనప్పటికీ కూడా, జ్ఞాని ఆత్మనిష్ఠకి భంగం కలిగిస్తుంది.

## అనుగ్రహం

62. అనుగ్రహం అంటే ఆత్మశక్తియే. అది ఆత్మను గుర్తింపజేసి, అందులో నిన్ను సంస్థితుడను చేసి, అహంకారాన్ని సంపూర్ణంగా నశింపచేస్తుంది. గురువు అంటే మూర్తీభవించిన అనుగ్రహ స్వరూపం.

63. అనుగ్రహం యొక్క పని, అనాత్మను నిరంతరం తెలియజేయడమే.

64. బేషరతుగా శరణాగతి చెందిన తరువాత, అనుగ్రహం మన జీవితంలో ప్రవేశించినదని తెలుసుకోవటానికి ఒకే ఒక చిహ్నం (సంకేతం) ఉంది. అనుగ్రహం పనిచేయడం ప్రారంభించినప్పుడు, జీవితం మన ప్రణాళికలు మరియు అంచనాలకు అతీతంగా జరుగుతుంది. మనం అన్నింటిపైనా మన పట్టును పూర్తిగా కోల్పోతాము; లేదా అనుగ్రహం

సర్వాన్ని తన స్వాధీనం చేసుకుని, దానికి మనల్ని సాక్షిగా చేస్తుంది.

65. మనస్సు మరియు బుద్ధి అనేవి, ఆత్మ గురించి కేవలం ఊహించగలవు. ఆత్మ యొక్క శుద్ధ ప్రజ్ఞ మాత్రమే దానిని తెలియజేస్తుంది మరియు అంతరంగములోనుండి దృవపరుస్తుంది (నిశ్చయపరుస్తుంది).

66. స్వరూపాన్ని వెల్లడి చేయుటకు, ఆత్మయొక్క శుద్ధ ప్రజ్ఞ తన సాన్నిధ్యాన్ని అంతరంగంలో ప్రేరేపించినప్పుడు, ఆత్మ సాక్షాత్కారం ఏక్షణంలోనైనా జరుగుతుంది.

67. మీ ముందు కనిపించే ప్రతిదీ అనుగ్రహం పరిధిలోనిదే. కాబట్టి వాటిని అన్నింటిని ఆశీర్వాదాలుగా స్వీకరించండి.

## కరుణ

68. ఇచ్చేవాడు (కర్త) లేకుండా ఇవ్వడమే కరుణ.

69. కరుణ యొక్క అత్యున్నత వ్యక్తీకరణయే గురుతత్త్వం.

70. నిజమైన కరుణ నిజమైన వైరాగ్యం నుండి వస్తుంది.

71. దైవం సానుభూతి కారణంగా మీకు కరుణ చూపించడు. మీ సహనం (తితీక్ష) చూసి మాత్రమే ఆయన కరుణను చూపించగలడు.

## జీవుడు

72. జీవుడే ఈశ్వరుడు. జీవుడు తన శరీరంతో తాదాత్మ్యం (మమేకం) చెంది, దాని చుట్టూ ఉన్న వాటిని 'నావి' అనుకొని తనను ఈ జీవితకాలానికే పరిమితం చేసుకుంటాడు. ఈ మమేకంను వదిలివేసినప్పుడు, జీవుడు ఈశ్వరుడి నుండి భిన్నంగా ఉండడు.

73. ప్రతి జీవుడు కర్తుత్వంతో కర్మ చేసి, ప్రతికూల ఫలితం వచ్చినప్పుడు దైవాన్ని ప్రశ్నిస్తాడు.

74. మనం కర్తగా విఫలమైనప్పుడల్లా, మనం విచారంగా ఉంటాము. కర్తుత్వం లేకుండా విఫలమైనప్పుడల్లా, మనం సంతోషంగానే ఉంటాము. మనం కర్తగా విఫలమైనప్పుడు మన వైఫల్యాన్ని అంగీకరించము, కానీ గెలవాలనే కోరిక ఉంటుంది. కాబట్టి మనం విచారంగా ఉంటాము. మనం కర్తుత్వం లేకుండా విఫలమైనప్పుడు, మనం అపజయాన్ని అంగీకరిస్తాము. విజయం కోసం

ఎటువంటి ఆశ ఉండదు. కాబట్టి మనం సంతోషంగానే ఉంటాము. లేదా, వైఫల్యం నాకు (ఆత్మకు) కాదు, అహంకారానికి అని మనం అర్థం చేసుకుంటాము.

75. భయం, సందేహం, అవిశ్వాసం మరియు దుఃఖం ఉన్నప్పుడు, అహంకారం పనిచేస్తుందని అర్థం చేసుకోండి. శాంతి, సంతృప్తి మరియు ఆనందం ఉన్నప్పుడు, ఆత్మ ప్రకాశిస్తుందని మరియు అహంకారం లేదని తెలుసుకోండి.

76. ఏది చేయాలన్నా కూడా, అహంకారం తన సంపూర్ణ అసమర్థతను తెలుసుకున్నప్పుడు, అది (అహంకారం) అనుగ్రహశక్తికి తనను సమర్పించుకుంటుంది. అహంకారంయొక్క అశక్తత యొక్క అనుభవపూర్వక జ్ఞానం కూడా అనుగ్రహం ద్వారానే ఇవ్వబడుతుంది. ఎందుకంటే అహంకారం తన ఓటమిని ఎన్నడూ అంగీకరించదు.

77. విషయములు ద్రష్టలో ఉంటాయి. ద్రష్టను త్యజించడం చేత, విషయముల యొక్క అస్థిత్వం

సహజంగానే అదృశ్యమవుతుంది. నిజమైన త్యాగం అంటే ద్రష్ట ఎన్నడూ లేడని గ్రహించడమే.

78. విషయముల వాస్తవికతకు కారణం ద్రష్టయొక్క వాస్తవికతయే.

79. 'నేను' (వ్యక్తిత్వం) అనే భావన ఎల్లప్పుడూ గతానికి పరిమితమై అందులో చిక్కుబడి ఉంటుంది. వర్తమానంలో దానికి ఏ పాత్ర లేదు.

80. అహంకారం ఒక దోషం కాదు, అది ఒక అవాస్తవిక ఆవరణ. దీనిని అర్థం చేసుకోవటమే జ్ఞానం.

81. హృదయంలో అహంకారం లయం అయినప్పుడు 'జీవ సమాధి' జరుగుతుంది. మనం జీవిస్తూ ఉన్నప్పుడే అంతరంగంలో జీవుని కోసం సమాధిని నిర్మించుకోవాలి. అలాంటి వారి శరీరం దహనం చేయబడినదా లేదా ఖననం చేయబడినదా అన్నది ముఖ్యం కాదు.

## మనస్సు యొక్క పోకడలు

**82**. మనసుతో ఏదైనా పట్టుకోవటం అనేది గతానికి సంబంధించినది. సత్యం ఎల్లప్పుడూ వర్తమానంలో ఉంటుంది.

**83**. అవసరం లేనప్పుడు, ఒక చర్య చేయాలనే కోరిక కర్మను ఆహ్వానిస్తుంది. ఒక చర్య చేయవలసి వచ్చినప్పుడు, తనను తాను నిష్క్రియులుగా ఉంచుకోవడం కూడా కర్మను ఆహ్వానిస్తుంది.

**84**. మనస్సు అనేది ఆత్మ నుండి ఉద్భవించే ఒక శక్తి మాత్రమే అని గుర్తిస్తే, ఏ ఆందోళన ఉండదు.

**85**. మనస్సు యొక్క స్వభావం విభజించటం లేదా వేరుపరచటం. ఎరుక తనలో అన్నింటినీ ఇముడ్చుకుని ఉంటుంది.

86. బుద్ధి మరియు మనస్సు విషయములను విభజిస్తాయి. హృదయం విషయములను ఐక్యం చేస్తుంది.

87. శరీరంతో చేసే కర్మ నిజమైన కర్మ కాదు. 'నేను కర్తను' అనే భావన దానిని కర్మగా చేస్తుంది.

88. కర్మను గురించిన ఆలోచన, ప్రతిఫలాపేక్ష కర్మబద్ధుడను చేస్తుంది. అంతేగానీ, కర్మ తానుగా బంధించదు.

89. మనస్సు లేదా శరీరం పరిగణ సూచికలుగా తీసుకున్నప్పుడు మాత్రమే బాహ్యం మరియు అంతరంగం అనేవి ఉంటాయి. పరిగణ సూచిక లేనప్పుడు, బాహ్యం ఎక్కడ మరియు అంతరంగం ఎక్కడ?

## జ్ఞానం

90. ఎరుక లేని జీవితం అజ్ఞానం. ఎరుకతో కూడిన జీవితం జ్ఞానం.

91. 'నాకు తెలియదు' అని నాకు నిజంగా తెలిసినప్పుడు, నేను అన్ని అవకాశ ద్వారాలను తెరుస్తున్నాను.

92. మనం అనుకూలమైన సమయాల్లో సంతోషంగానే ఉంటాము, కానీ ప్రతికూల సమయాల్లో కూడా మనం సంతోషంగా ఉంటే, అదే జ్ఞానం.

93. మనం దేని మీద అయితే శ్రద్ధ పెడతామో దానికి మనం విలువ ఇస్తున్నామని అర్థం.

94. సమయం మరియు జీవితానికి విలువ ఇచ్చే వ్యక్తి, ఆ రెండింటికి అతీతమవుతాడు.

95. ఆనంద స్వరూపులమైన మనం అది మరిచిపోయి బాహ్యములో తిరుగుతూ (చరిస్తూ), వివిధమైన విషయాల నుండి ఆనందం వస్తుందని భ్రమిస్తాము. జీవితములో వ్యక్తుల నుండి, విషయముల నుండి దుఃఖం రావడం అక్కడ ఆనందం లేదని సూచించటానికే. మన దోషపూరిత దృష్టి దుఃఖానికి వాస్తవికతను కల్పిస్తుంది. దీనిని గ్రహించడం మరియు గుర్తించడం కేవలం అనుగ్రహం ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది.

96. గౌరవాన్ని కోరడం గౌరవాన్ని తీసుకురాదు. మీ చుట్టూ ఉన్న ప్రతిదాన్ని గౌరవించడం మిమ్మల్ని గౌరవప్రదుడను చేస్తుంది.

97. వ్యక్తిత్వం నశించినప్పుడు ఉన్న శాంతి, వ్యక్తిత్వం ఉన్నప్పుడు (అది ఎంత గొప్పదైనా కావచ్చు), ఆ శాంతిని అనుభవించలేము.

98. నిజమైన స్వేచ్ఛ అంటే శరీరం, మనస్సు మరియు అహంకారం నుండి స్వేచ్ఛ. అంతేకానీ శరీరం, మనస్సు మరియు అహంకారం యొక్క స్వేచ్ఛ కాదు.

99. సత్యములో సంస్థితుడవై ఎటువంటి పరిస్థితులు ఎదురైనా జ్ఞానంతో పరిష్కరించుకొని మరియు వాటి నుండి పాఠాలు నేర్చుకుని ముందుకు సాగితే, నీ యొక్క సాధన సమతుల్యం అయ్యి చివరగా సంపూర్ణం అవుతుంది.

100. బోధించడం (ఒకరికి చెప్పటం) ఆగిపోయినప్పుడు మాత్రమే నిజమైన నేర్చుకోవటం ప్రారంభమవుతుంది.

101. ఈ ప్రపంచంలో చాలా మంది వక్తలు ఉన్నారు. ఆచరించేవారు అరుదు. ఆచరించేవారు మౌనంగా ఉంటారు.